సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 16 । జులై । 2024



సారకంద.. ఆ ఊరికి అండ

అక్కడ సారకంద మాత్రమే పండిస్తారు. తరతరాలుగా ఈ పంటపైనే ఆధారపడి బతుకుతున్నారు.

- 8లో



పండగ చూద్దామని వచ్చి..

పొందూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పండగ చూద్దామని వచ్చి చనిపోయాడు.

- 8లో

దరఖాస్తుకు గడువు పెంపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవడానికి పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు గడువు పెంచినట్టు జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన ఉపాధ్యాయులు నేషనల్ అవార్డ్స్ టు టీచర్స్ ఎడ్యుకేషన్.జీవోవి.ఇన్ అనే వెబ్‌పోర్టల్‌లో ఈ నెల 18వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అంతకుముందు 15వ తేదీతో గడువు ముగియగా, మరో మూడు రోజులు గడువు పొడిగించారు.

న్యూస్‌రీల్

'అందరి సహకారంతో పనిచేశాను'



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న జీఆర్ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, ఎన్నికల నిర్వహణలో అందరి సహకారంతో ముందుకు సాగానని జిల్లా నుంచి బదిలీ అయిన ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో సోమవారం ఆమెకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాలో పోలీసు యంత్రాంగం సేవలను కొనియాడారు. సార్వత్రిక ఎన్నికలు ఎలాంటి సమస్య లేకుండా, ప్రశాంతంగా నిర్వహించగలిగామని అన్నారు. జిల్లాలో రెండున్నరేళ్లు పనిచేశానని, పోలీస్ శాఖ ప్రజలతో కలిసి పనిచేసే విధంగా ప్రోత్సహించామని తెలిపారు. అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, డీఎస్పీలు పాల్గొన్నారు.

18 నుంచి ఆగస్టు 2 వరకు కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ తదితరులు

అరసవల్లి: కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని ఈ నెల 18 నుంచి ఆగస్టు 2 వరకు నిర్వహించనున్నట్లుగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ తెలియజేశారు. ఈ మేరకు జిల్లా వైద్యారోగ్య శాఖ, కుష్టు నివారణ సంస్థల ఆధ్వర్యంలో డ్రైవ్‌కు సంబంధించిన కరపత్రాలను, వాల్‌పోస్టర్లను ఆయన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏదో మొక్కుబడిగా కార్యక్రమాలను నిర్వహించవద్దని, పక్కాగా గుర్తింపు ప్రక్రియ జరగాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జెడ్పీ సీఈఓ వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ రామ్మోహనరావు, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

'సురక్షిత ప్రయాణం అవసరం'



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వాహన చోదకులు సురక్షితంగా ప్రయాణించాలని, అతివేగం అనర్థాలు తెచ్చి పెడుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. సోమవారం ఎంపీఆర్ న్యాయ కళాశాలలో మోటారు వాహన చట్టం, హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. మోటారు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అతివేగం కూడదని సూచించారు. హెల్మెట్ పెట్టుకోవడంలో నిర్లక్ష్యంప్రదర్శించకూడదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.మోషె, అడ్వకేట్ ఐ.పాపయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశోధనలకు ప్రాధాన్యమివ్వాలి



పరిశోధన పత్రాలు ప్రదర్శిస్తున్న వీసీ రజిని, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: వర్సిటీలో పనిచేస్తున్న బోధన సిబ్బంది పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ కేఆర్ రజిని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో రీసెర్చ్ ఫోరంను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యోగ, ఉపాధి లక్ష్యంగా విద్యా బోధనలో మార్పులు అవసరమని పేర్కొన్నారు. ప్రతి బోధకుడు పరిశోధన పత్రాలు రాయాలని అన్నారు. ప్రముఖ జర్నల్స్‌లో పరిశోధన పత్రాలు పబ్లిష్ అయ్యేలా వ్యాసాలు ఉండాలని చెప్పారు. అంతర్జాతీయంగా, జాతీయంగా విద్యలో వస్తున్న మార్పులు గమనించాలని సూచించారు. రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్యను రీసెర్చ్ ఫోరం అధ్యక్షునిగా, ఎస్.సంతోష్ రంగనాథ్‌ను కన్వీనర్‌గా నియమించారు.

స్పష్టమైన ప్రకటన ఇవ్వాలి..



నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్‌పై కొత్త ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలి. నిరుద్యోగ భృతిని తక్షణమే అమలు చేయాలి. ఖాళీగా ఉన్న పోస్టులను కూడా భర్తీ చేయాలి.

– టి.సూర్యం, నిరుద్యోగ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు

ఎప్పుడు ఇస్తారు..?



నిరుద్యోగ భృతి ఎప్పటి నుంచి ఇస్తారో స్పష్టంగా ప్రకటన చేయాలి. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్టుగా నిరుద్యోగులను ఆదుకోవాలి.

– పంచిరెడ్డి జ్ఞానేశ్వరి, ఎంఎస్సీ బీఈడీ, మాకివలస గ్రామం, సారవకోట మండలం

'భృతి' ఎప్పుడిస్తారో..?



నేను పీజీ పూర్తి చేసి రెండేళ్లయ్యింది. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాను. నిరుద్యోగ యువతకు ఉద్యోగం వచ్చేవరకూ నెలకు రూ.3000 ఇస్తామని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు గడిచింది. అయినా నిరుద్యోగ భృతిపై ఎక్కడా ఎలాంటి ప్రకటన లేదు. ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

– గాలి శంకర్, నిరుద్యోగి, మెళియాపుట్టి గ్రామం

విధి విధానాలేవీ..?



అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాలు కల్పిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. నిరుద్యో భృతి అయినా ఇస్తా మని చెప్పింది. కానీ ఇప్పటివరకు నిరుద్యోగ భృతిపై విధివిధానాలైనా రాలేదు.

– పసుపురెడ్డి అశోకుమార్, నిరుద్యోగి (డిగ్రీ), మహసింగి కాలనీ, కొత్తూరు మండలం

అన్ని అర్హతలు ఉన్నాయి



మాది పేద కుటుంబం. నేను డిగ్రీ వరకూ చదువుకున్నాను. ప్రస్తుతం డిఫెన్స్ ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాను. చంద్రబాబునాయుడు ఇస్తామన్న నిరుద్యోగి భృతికి నాకు అన్ని అర్హతలు ఉన్నాయి. నిరుద్యోగ భృతికి దరఖాస్తు చేసుకునేందుకు నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నాను.

– ఎం.ఆదర్శ్, శ్రీకాకుళం



బోత్ ఆర్ నాట్ సేమ్ తమ్ముళ్లు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, మన ప్రభుత్వానికి వ్యత్యాసం ఉంటుంది. ప్రతి యువతకు ఉద్యోగం కల్పించే బాధ్యత తీసుకుంటాను. ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలు ఇస్తాను. ఉద్యోగం వచ్చే వరకు అమ్మానాన్నలపై ఆధారపడే పరిస్థితి లేదు. నెలకి రూ.3వేల భృతి ఇస్తాం. మీ అకౌంట్‌లోకి వస్తుంది. వర్క్ ఫ్రం హోమ్ పెడతాను. మీ ఇంట్లో కూర్చొని అమ్మానాన్నలను చూసుకుంటూ ప్రపంచంలో ఏ కంపెనీ కావాలన్నా పనిచేసుకునే సంస్కృతికి శ్రీకారం చుడతాను.

– శ్రీకాకుళం ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలివి.



బాబు నిరుద్యోగ భృతి ఎప్పుడు

హామీ అమలుచేయాలి..



నిరుద్యోగ భృతి తక్షణం అమలుచేయాలి. 2014లో ఇలాగే హామీ ఇచ్చి వదిలేశారు. అప్పట్లో నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం వంటివేవీ అమలు చేయలేదు. ఈసారైనా సూపర్ 6 పథకాలు అమలు చేసి మాట నిలబెట్టుకోవాలి. అధికారం వచ్చి నెలరోజులు దాటినా నిరుద్యోగ భృతిపై ఎటువంటి ప్రకటన లేదు. తక్షణమే నిరుద్యోగ భృతి కల్పించాలి. – దీర్ఘాశి జగదీష్, నిరుద్యోగ యువకుడు, పాత హిరమండలం,

నిరుద్యోగ భృతి కాదు కదా భ్రాంతి!

- నిరుద్యోగ భృతిపై కానరాని కార్యాచరణ
- భృతిపై గంపెడాశలు పెట్టుకున్న 7,28,210 మంది నిరుద్యోగులు
- ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇస్తామని టీడీపీ హామీ
- మాట నిలబెట్టుకోవాలని కోరుతున్న యువత
- జాబ్ క్యాలెండర్, డీఎస్సీపైనా స్పష్టత కరువు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కూటమి ప్రభుత్వం కొలువుదీరి నెల దాటిపోయింది. కానీ నిరుద్యోగ భృతిపై ఇప్పటికీ స్పష్టమైన ప్రకటన రాలేదు. జాబ్ క్యాలెండర్‌పైనా అతీగతి లేదు. ఆఖరికు తొలి సంతకం అంటూ హడావుడి చేసిన మెగా డీఎస్సీ విషయంలోనూ స్పష్టత లేదు. దీనికి తోడుగా గత ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దు చేశారు. టెట్ నోటిఫికేషన్ మాత్రమే ఇచ్చారు. మెగా డీఎస్సీపై ఆశలు పెట్టుకున్న వేలాది మంది విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, గుంటూరు, నంద్యాల తదితర ప్రాంతాలకు వెళ్లి కోచింగ్ సెంటర్లలో చదువుతున్నారు. కనీసం ఆరు నెలలు కోచింగ్ తీసుకుంటే రూ.60వేల నుంచి రూ.70వేల వరకు అవుతుంది. ఇంకా దాటితే రూ.లక్ష వరకు ఖర్చు తప్పదు. ఇప్పటి వరకు మెగా డీఎస్సీపై క్లారిటీ లేకపోవడంతో వారంతా ఆందోళనలో ఉన్నారు. పోనీ డీఎస్సీ ద్వారానో, గ్రూప్స్ ద్వారానో ఉద్యోగం వచ్చేవరకు చంద్రబాబు ప్రకటించిన నిరుద్యోగ భృతి అయినా ఇస్తారనుకుంటే దానిపైనా స్పష్టత లేదు. నెలకి రూ.3వేలు చొప్పున ఇస్తానన్న భృతికి సంబంధించి ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. అసలు దానికి సంబంధించిన కసరత్తే ప్రారంభించలేదు.

యువతను వదలని అనుమానం..



నిరుద్యోగ యువతకు భృతి ఇస్తామంటూ చెప్పడం చంద్రబాబుకు కొత్త కాదు. ఎన్నికలు జరిగిన ప్రతిసారి నిరుద్యోగ భృతి హామీ ఇస్తారు. కానీ ఒక్కసారి కూడా హామీ అమలు చేయలేదు. 1995 నుంచి పలు ఎన్నికల్లో చంద్రబాబు నిరుద్యోగ భృతి హామీ ఇచ్చారు. కానీ ఒక్కసారైనా ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదు. 2014లో ఇంటికొక ఉద్యోగం, ఇవ్వకపోతే నెలకి రూ. 2వేలు భృతి అన్నారు. కానీ ఏ ఒక్కరికీ ఇవ్వలేదు. 2024 ఎన్నికల్లో మళ్లీ నిరుద్యోగ భృతి ప్రకటించారు. సంవత్సరానికి నాలుగు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగం వచ్చే లోపు నిరుద్యోగికి నెలకి రూ.3వేలు చొప్పున ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక దానిపై ఇంతవరకు క్లారిటీ ఇవ్వలేదు. దీంతో మళ్లీ మోసపోతామోనన్న భయం నిరుద్యోగ యువతకు పట్టుకుంది.

7,28,210 మంది ఎదురుచూపులు

జిల్లాలో 7లక్షల 28వేల 210మంది వరకు నిరుద్యోగులు ఉన్నట్టు ప్రాథమిక లెక్కలు చెబుతున్నాయి. వీరిలో కొంతమంది తప్పని పరిస్థితుల్లో కూలీనాలీ పనులు చేసుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగం లేక కొందరు చిన్నా చితకా కంపెనీల్లో కార్మికుల్లా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రకటించిన జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి ఆసరాగా నిలుస్తాయని నిరుద్యోగ యువత భావించారు. ఆ హామీలకు ఆకర్షితులై ఓటేశారు. కానీ భృతి విషయమై ప్రభుత్వం ఎలాంటి ముందడుగు వేయలేదు. డీఎస్సీ ద్వారా జిల్లాలో కనీసం 538మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. ఈ లెక్కన డీఎస్సీ ప్రక్రియతో నిరుద్యోగం తగ్గే పరిస్థితి లేదు. పెద్ద ఎత్తున ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తే తప్ప జిల్లాలో నిరుద్యోగం తగ్గదు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగా ఏటా 4లక్షల ఉద్యోగాలు చొప్పున ఐదేళ్లలో 20లక్షలిస్తే కొంతమేరకు జిల్లాలో నిరుద్యోగం తగ్గే అవకాశం ఉంది. కానీ చంద్రబాబు ఏనాడూ ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పరిస్థితి లేదు. గత అనుభవాల దృష్ట్యా ఏం చేస్తారోనన్న టెన్షన్ యువతకు పట్టుకుంది. మరోవైపు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సచివాలయాల ఉద్యోగాలు, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగాలు, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, ప్రముఖ కంపెనీల రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లతో జిల్లాలోనే వేలాదిమందికి ఉద్యోగాలు వచ్చాయి. 2019 ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగా నియామకాలు చేపట్టింది. జిల్లాలోనే యువతకు స్థానికంగానే ఉద్యోగాలను కల్పించింది.

మన జవాన్ వీర మరణం

- జమ్ములోని ఎదురుకాల్పుల్లో ఆర్మీ హవల్దార్ జగదీశ్వరరావు మృతి
- ఆయన స్వస్థలం నందిగాం మండలం వల్లభరాయునిపాడు



ఉగ్రవాదుల ఎదురుకాల్పుల్లో మృతి చెందిన హవల్దార్ జగదీశ్వరరావు

నందిగాం: మండలంలోని వల్లభరాయునిపాడుకు చెందిన సనపల జగదీశ్వరరావు(42) సోమవారం జమ్ములో ఉగ్రవాదులతో జరిగిన కాల్పుల్లో వీర మరణం పొందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సనపల మల్లేశ్వరరావు, మహలక్ష్మీ దంపతులకు జగదీశ్వరరావు, విఘ్నేశ్వరరావులు ఇద్దరు కుమారులు. వీరిద్దరూ ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నారు. జగదీశ్వరరావు గత 22 ఏళ్లుగా పనిచేస్తూ ప్రస్తుతం ఒక ఏడాది నుంచి జమ్ములో హవల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం మిలిటెంట్లతో జరిగిన కాల్పుల్లో జగదీశ్వరరావు మృతి చెందినట్లు ఉన్నతాధికారులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. జగదీశ్వరరావుకు భార్య సమత, ఇద్దరు కుమార్తెలు మోక్ష, దీక్షలు ఉన్నారు. భార్య సమత మండలంలోని దిమిలాడ సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తున్నారు. జగదీశ్వరరావు మరణవార్త తెలిసి తల్లిదండ్రులు, భార్య గుండెలవిసేలా రోదించారు. అందరితో కలివిడిగా ఉండే జగదీశ్వరరావు మరణ వార్తతో గ్రామంలోనూ విషాద ఛాయలు అలముకున్నాయి. జమ్ము నుంచి మృతదేహం రాకకోసం వాళ్లంతా ఎదురు చూస్తున్నారు.

24 ఫిర్యాదుల స్వీకరణ



ప్రజా ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్

శ్రీకాకుళం క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జిల్లా అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్ నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు కార్యక్రమానికి 24 ఫిర్యాదులు అందాయి. అదనపు ఎస్పీ ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వివరాలు సేకరించి సమస్యలను తెలుసుకున్నారు. వచ్చిన ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులకు పంపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మహిళా రక్షణకే తొలి ప్రాధాన్యం

గంజాయిపై ఉక్కు పాదం

- ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కేవీ మహేశ్వరరెడ్డి



ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ :

జిల్లా నూతన ఎస్పీగా కేవీ మహేశ్వర రెడ్డి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ముందుగా జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం అర్చకులు వేదమంత్రాలు, పూర్ణకుంభం, మంగళవాయిద్యాలతో ఆహ్వానించగా ప్రత్యేక పూజలు చేసి 12.20 గంటల ముహూర్త సమయాన విధుల్లో చేరారు. అదనపు ఎస్పీలు జి.ప్రేమ్‌కాజల్ (అడ్మిన్), వి.ఉమామహేశ్వరరావు, సెబ్ అదనపు ఎస్పీ డి.గంగాధర్, ఏఆర్ డీఎస్పీ శేషాద్రినాయుడు, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ అసోసియేషన్ సభ్యులు, కార్యాలయ సిబ్బంది ఎస్పీకి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందించారు. అనంతరం అదనపు ఎస్పీలు, డీఎస్పీలతో జిల్లా పరిస్థితులపై కాసేపు సమీక్షించారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

మహిళల రక్షణకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని, మహిళలు, బాలికల అదృశ్య కేసులపై ప్రత్యేక దృష్టి పెడతామని జిల్లా నూతన ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో తనకు ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, డీజీపీలకు ముందుగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సంక్షేమం దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు.

పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గంజాయి క్రయ విక్రయాలు, అక్రమ రవాణా మూలాలపై నిఘా పెడతామన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఇదివరకు పనిచేయడంతో తనకు ఆ అనుభవం ఉందని, గంజాయిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను చట్టప్రకారం పరిష్కరించి నేర రహిత శ్రీకాకుళం జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీసీ శివకుమార్, రెండో పట్టణ సీఐ ఉమామహేశ్వరరావు, పీఆర్వో భాస్కర్ పాల్గొన్నారు.

- మంత్రిని కలిసిన ఎస్పీ

కోటబొమ్మాళి: నిమ్మాడ మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అచ్చెన్నకు పుష్పగుచ్ఛం అందజేశారు.



తిరుగు ప్రయాణంలో జగన్నాథుని రథం



భక్తితో నమస్కరిస్తున్న చిన్నారి

నేత్రపర్వం..

స్థానిక ఇల్లీసుపురం కూడలి వద్ద గత పదిరోజులుగా జరిగిన రథయాత్ర ఉత్సవం సోమవారం మారు రథయాత్ర తిరువీధి ఉత్సవంతో ముగిసింది. బొందిలీపురంలో ఉన్న సదావర్తి పులహరీ తఖియామఠంలో కొలువైన సుభద్ర, బలభద్రల సమేత శ్రీజగన్నాథస్వామి మూర్తులకు పూరీ సంప్రదాయంలో పూజలు మఠం నిర్వాహకులు నిర్వహించారు. సాయంత్రం గుండిచా నుంచి ఉత్సవ మూర్తులను తిరిగి ఆలయానికి చేర్చారు.

– శ్రీకాకుళం కల్చరల్

ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక మీ కోసంను సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన జేసీ ఎం.నవీన్‌తో కలిసి నిర్వహించారు. జి.సిగడాం మండలం వెలగాడ గ్రామానికి చెందిన పెట్టి ఆదిలక్ష్మి నడవలేని స్థితిలో ఉండడంతో కలెక్టర్ నేరుగా ఆమె వద్దకు వెళ్లి సమస్యను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 191 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి జిల్లా అధికారి ప్రతికూల వార్తలపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జిల్లా పరిషత్ సీఈఓ వెంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ రామ్మోహనరావు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కొన్ని ఫిర్యాదులు..

- ఎచ్చెర్ల మండలం కొంగరాం పంచాయతీలో ఉన్న గ్రామాల్లో బోరు నీరు కలుషితమైందని, తమకు శుద్ధమైన తాగునీటి సదుపాయం కల్పించాలని సర్పంచ్ భాగ్యలక్ష్మి, గురువు సింహాద్రి, అచ్యుతరావు తదితరులు కోరారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

- బీఆర్ఏయూలో రోస్టర్ ప్రకారం నియామకాలు జరగడం లేదని, అక్కడ వీసీని మార్చాలని, అవినీతిపై దర్యాప్తు చేయాలని వివిధ సంఘాల ప్రతినిధులు బోనెల అప్పారావు, డి.గణేష్, టి.రమణ, తదితరులు వినతి పత్రం అందించారు.
- ఎస్ఎం పురం రెవెన్యూలోని సర్వే నంబర్ 514–1, 3లో అనుమతులు లేకుండా డెయిరీ ఫారంను ఏర్పాటు చేస్తున్నారని, దీని వల్ల కాలుష్యం వ్యాపిస్తోందని ఆ గ్రామానికి చెందిన కొత్తకోట అప్పారావు ఫిర్యాదు చేశారు.

సర్వర్ల మొరాయింపు

జెడ్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో దరఖాస్తులు రిజిస్ట్రేషన్ చేసే కంప్యూటర్లు మొరాయించాయి. దీంతో ఫిర్యాదుదారులు ఇబ్బందిపడ్డారు.

క్లుప్తంగా

ఉద్యోగుల సమస్యలపై వినతి

కోటబొమ్మాళి: రాష్ట్ర ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు అలికాన రాజేశ్వరితో పాటు పలువురు సంఘ ప్రతినిధులు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును నిమ్మాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలతోపాటు పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ ప్రతినిధులు కిలారి నారాయణ రావు, చల్లా బాలకృష్ణ, రాణాప్రతాప్, సూర్య నారాయణ, వెంకటరమణ, జయమ్మ, తనూజ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ నిర్వహణకు రూ.2లక్షలు విరాళం



ఆశ్రమ నిర్వాహకులకు విరాళం అందిస్తున్న దాతలు

కంచిలి: మండలంలోని మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమం నిర్వహణకు ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి, ధర్మపురం, తేలకుంచి, హరిపురం గ్రామాలకు చెందిన దాతలు రూ.2,10,000లు విరాళాన్ని నిర్వాహకులకు అందజేశారు. ఇచ్ఛాపురం మండలం ధర్మపురం గ్రామానికి చెందిన దాతలు చట్టి నరేష్‌కుమార్, ప్రీతి దంపతులు. నరేష్ రష్యాలో ఉంటారు. అలాగే ధర్మపురం గ్రామస్తులు రూ.10వేలు, లొద్దపుట్టి, హరిపురం, తేలుకుంచి గ్రామాల మహిళలు 24 మంది విద్యార్థులకు స్కూల్ యూనిఫారాలు, బూట్లు పంపిణీ చేశారు. ఈ దాతలకు ఆశ్రమ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

సారకంద.. ఆ ఊరికి అండ




- సారకందకు పెట్టింది పేరు మరదరాజపురం
- ఆంధ్రా–ఒడిశాలో పట్టణాలకు ఎగుమతి
- ఊరిలో ఎనభై శాతం కుటుంబాలకు ఈ పంటే ఆధారం

కాశీబుగ్గ :

వందల ఏళ్లుగా అక్కడ ఒకటే పంట పండిస్తున్నారు. తరతరాలుగా ఆ పంట సాగుపైనే ఆధారపడి బతుకుతున్నారు. రాజుల కాలం నుంచి అదే ఆనవాయితీగా బతుకుతున్నారు. పలాస మండలంలోని మరదరాజపురం ఈ ప్రత్యేక సంప్రదాయాన్ని పాటిస్తోంది. ఈ ఊరి సారకంద అంటే చుట్టుపక్కల గ్రామాల వాళ్లందరికీ నోరూరుతుంది. రాజుల కాలం నుంచి ఆ ప్రాంతంలో సారకందను పండిస్తున్న రైతులు ఇప్పటికీ అదే రుచి ఇచ్చే పంటను అందించగలుగుతున్నారు.

ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో ఉన్న మహేంద్ర గిరుల నుంచి ఈ ఊరికి గెడ్డ వస్తుంది. ఈ నీటి వనరుతో జనవరి నెల నుంచి వారాల తేడాలో రైతులు భూమిలో దుంప ముక్కలు నాటడంతో అవి మొక్కలుగా మొలకెత్తుతాయి. రోజు విడిచి రోజు నీరు పెట్టడంతో ఐదు నుంచి ఆరు మాసాల్లో మంచి దిగుబడి వస్తుంది. మరదరాజపురంలో ఉన్న సుమారు వందకుపైగా కుటుంబాల్లో ఎనభైశాతం కుటుంబాలు సారకంద మాత్రమే పండిస్తాయి. ఈ గ్రామంలో భూమి లేని వారు



మరదరాజపురం గ్రామానికి పెనవేసుకున్న బంధంలా ఆనుకుని ఉన్న పంట

సైతం పక్క గ్రామాల్లో రైతుల వద్ద కౌలుకు తీసుకుని ఈ పంటను పండిస్తారు. ఈ గ్రామంలో ఎకరాకు ఐదు టన్నుల పంటను పండిస్తారు.

విడదీయలేని బంధం మాది

మా తాతల కాలం నుంచి సారకందను పండిస్తున్నాం. మేం సారకంద తప్పిస్తే ఏ పంటనూ పండించలేము. ఆరుమాసాల పాటు ఈ పంటలను పండించి వచ్చిన ఆదాయంతో బతుకుతాం. తర్లాకోట రాజవంశీయులకు ఈ గ్రామం నుంచి తొలిపంటను ఒకప్పుడు అందించేవాళ్లం. సారకందతో మాకు విడదీయరాని బంధం ఉంది.

– భాస్కర మిశ్రో, సారకంద రైతు, మరదరాజపురం

ఇతర ప్రాంతాలకు ఎగుమతులు

ఈ ఊరికి సరిగ్గా కిలోమీటరు దూరంలో ఒడిశా సరిహద్దు ఉంది. దీంతో చాలా మంది ఒరియా మాట్లాడతారు. జగన్నాథుడిని కొలుస్తారు. రవాణా సౌకర్యం కూడా ఉండడంతో ఒడిశాలోని భువనేశ్వర్, బరంపురం, గుణుపూర్, పర్లాఖిమిడి, గారబంద, రాయగడ, ఇక ఆంధ్రాలో ఏడుకిలోమీటర్ల దూరంలో ఉన్న పలాస–కాశీబుగ్గ జంటపట్టణాలతో పాటుగా శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, ఇచ్ఛాపురం, ముఖలింగం, ఎల్‌ఎన్ పేట, సొంపేట. పూండి ప్రాంతాలకు సారకంద తరలిస్తారు. అలాగే వ్యానుల్లో ఒడిశా, చత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్‌కు కూడా ఎగుమతి చేస్తుంటారు.

● ప్రభుత్వం మారింది.. సచివాలయం మూత పడింది!



ఇదేమీ పాత భవనం కాదు. నిన్న మొన్నటి వరకు ఉద్యోగులు, జనంతో కళకళలాడిన గ్రామ సచివాలయం. ఇచ్ఛాపురం మండలంలోని బిర్లంగి గ్రామంలోనిదీ భవనం. రేషన్ కార్డులు, పెన్షన్లు, ధ్రువీకరణ పత్రాలు అంటూ నిత్యం జనాలతో ఈ భవనం కళకళలాడేది. కానీ కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో నెల రోజులుగా ఈ భవనం తెరచుకోవడం లేదు. కొందరు ఉద్యోగులు బదిలీపై వెళ్లిపోగా.. ప్రస్తుతం ఉన్న పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ సహాయకుడు, విలేజ్ సర్వేయర్లలో వ్యవసాయ సహాయకుడు ఆర్బీకేకు పరిమితమయ్యారు. మరో ఇద్దరు కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి సచివాలయానికి రావడం లేదు. ఒకప్పుడు ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ కళకళలాడిన ఈ కార్యాలయం ఇప్పుడిలా కళా విహీనమైంది.

– ఇచ్ఛాపురం రూరల్

పండగ చూద్దామని వచ్చి..

- రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



దుర్గాప్రసాద్ (ఫైల్)



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు

పొందూరు: తల్లిదండ్రులను పోషించడానికి ఎక్కడో విజయవాడ వెళ్లి పనిచేసుకుంటున్నాడు. ఊరిలో పండగ చూద్దామని, తల్లిదండ్రులతో ఆనందంగా గడుపుదామని వచ్చాడు. కానీ రోడ్డుప్రమాదం రూపంలో వచ్చిన మృత్యువు అతడిని తీసుకెళ్లిపోయింది. పొందూరు కాలేజీ రోడ్డులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాకర్ల దుర్గాప్రసాద్(26) దుర్మరణం పాలయ్యాడు. పొందూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

తండ్యాం పంచాయతీ తండ్యా మెట్ట(ఎస్‌ఆర్‌ఎన్ కాలనీ)కి చెందిన కాకర్ల కృష్ణ, కొండమ్మల కుమారుడు దుర్గాప్రసాద్ డిగ్రీ పూర్తి చేశాడు. తల్లిదండ్రులు నేత కార్మికులు కావడంతో కుటుంబ పోషణ కోసం విజయవాడ వెళ్లి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఊరిలో అమ్మవారి పండుగ జరుగుతుండడంతో తల్లిదండ్రులు కుమారుడికి కబురు పంపించారు. దీంతో అతను ఊరికి వచ్చాడు. పండుగ చేసుకునేందుకు సామాన్లు కొనేందుకు స్నేహితుడు కావూరి చిన్నారావుతో కలిసి బైక్‌పై పొందూరు బయల్దేరాడు. కాలేజీ రోడ్డు వద్ద అతని బైక్‌ను పౌల్ట్రీ వ్యాన్ బలంగా ఢీకొట్టింది. బండిపై ఉన్న ఇద్దరూ కింద పడిపోవడంతో వ్యాను దుర్గారావు తలపై నుంచి వెళ్లిపోయింది. దీంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుడు చిన్నారావుకు చేయి విరిగింది. ప్రమాదానికి కారణమైన వ్యాన్‌ను ఆపకుండా డ్రైవర్ వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘట నా స్థలానికి చేరుకుని సీసీ కెమెరాలు ఆధారంగా డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని వ్యాన్‌ను స్టేషన్‌కు తరలించారు. తీవ్రంగా గాయపడిన చిన్నారావును శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. దుర్గా ప్రసాద్ మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టంకు రిమ్స్‌కు తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఇ.వెంకటరమణ కేసు నమోదు చేశారు.

కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు

పండగ కోసం గ్రామానికి వచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు కృష్ణ, కొండమ్మలు కన్నీరుమున్నీరయ్యారు. వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. దుర్గాప్రసాద్ మృతితో తండ్యాం మెట్ట గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

'లైంగికదాడి నిందితుడిని శిక్షించాలి'



మాట్లాడుతున్న ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు బతకల ఈశ్వరమ్మ

కాశీబుగ్గ: విజయనగరం జిల్లా రామభద్రాపురంలో 6 నెలల పసికందుపై 40 ఏళ్ల కామాంధుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడని, ఈ కామాంధుడిని కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ డిమాండ్ చేశారు. పలాస సూదికొండ కాలనీలో సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆరు నెలల పసికందు నుంచి 60 ఏళ్ల వృద్ధులపై అత్యాచారాలు పెరుగుతున్నాయని, ఆడపిల్ల దుస్తుల మీద కామెంట్ చేసిన వారు ఈ పసికందుపై ఏం మాట్లాడతారని ప్రశ్నించారు. వ్యవస్థల్లో స్త్రీల పట్ల ఉన్న దృక్పథం మారాలన్నారు. ఆమెతో పాటుగా జిల్లా కార్యవర్గ సభ్యురాలు కంప సరస్వతి, గౌరమ్మ, సుందరమ్మ పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి చెస్ టోర్నీలో సేతుమాధవ్ ప్రతిభ



సేతుమాధవ్

శ్రీకాకుళం న్యూకాలనీ: లాఫ్లాగ్నే అక్సెషన్ ఇంటర్నేషనల్ కేటగిరీ చెస్ టోర్నమెంట్‌లో ఏలుమహంతి సేతు మాధవ్ చాంపియన్‌గా నిలిచాడు. ఫ్రాన్స్‌లో తాజాగా జరిగిన ఈ టోర్నమెంట్‌లో శ్రీకాకుళం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన సేతుమాధవ్ 9 రౌండ్లకుగాను 8 పాయింట్లు సాధించడం గమనార్హం. ఇందులో 7 రౌండ్లు గెలవగా, మరో రెండు గేమ్‌లు డ్రా చేసుకొని ఓటమనేది లేకుండా 8 పాయింట్లు సాధించాడు. దీంతో 1000 యూరోస్ అనగా భారతదేశ కరెన్సీలో సుమారు లక్ష రూపాయల నగదు బహుమతి అందుకున్నాడు. మరికొన్ని రోజులు ఫ్రాన్స్‌లోనే ఉండి ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిల్‌తో తిరిగి ఇండియాలో అడుగుపెట్టేలా తీర్చిదిద్దామని ఆంధ్రా చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సనపల భీమారావు పేర్కొన్నారు.

జిల్లా సీనియర్స్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ (పురుషులు, మహిళలు) సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు బుధవారం జరగనున్నాయని శ్రీకాకుళం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు, ప్రధాన కార్యదర్శి సిగిలిపెల్లి లక్ష్మీదేవి తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్)కళాశాల మైదానం వేదికగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులను జిల్లా ప్రాబబుల్స్ జట్లకు ఎంపికచేసి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తామని, శిబిరాల్లో రాణించిన క్రీడాకారులను జిల్లా తుది జట్లకు ఎంపిక చేస్తామని తెలిపారు.

ఆగస్టు 10 నుంచి రాష్ట్రపోటీలు..

గుంటూరు జిల్లా వేదికగా ఆగస్టు 10 నుంచి 12వ తేదీ వరకు ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్–2024 పోటీలు జరగనున్నాయని చెప్పారు. జిల్లా నుంచి ఎంపికచేసిన క్రీడాకారులను రాష్ట్రపోటీలకు పంపిస్తామన్నారు. జిల్లా ఎంపికల్లో పాల్గొనేందుకు హాజరయ్యే క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, సాఫ్ట్‌బాల్ ఐడీ కార్డుతో హాజరుకావాలని వారు కోరారు. ఎంపికలు జరిగే ఆర్ట్స్ కళాశాల మైదానంలో సాఫ్ట్‌బాల్ సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి ఎంవీ రమణ వద్ద రిపోర్ట్ చేయాలని, వివరాలకు 9441011391 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉసురు తీసిన ఆస్తి వివాదం



నర్సమ్మ మృతదేహం

హిరమండలం: ఆస్తి వివాదం ఓ కుటుంబంలో చిచ్చు రేపింది. నిండు ప్రాణాన్ని బలిగొంది. ఎంఎల్ పురం కాలనీలో జరిగిన ఈ ఘటనలకు సంబంధించి హిరమండలం ఎస్ఐ జి.నారాయణస్వామి తెలిపిన వివరాలు ప్రకారం.. ఎంఎల్ పురం కాలనీలో తోణంగి అమ్మన్న కుమారుడు లక్ష్మణరావుతో కలిసి నివాసముంటున్నారు. ఇటీవల కుమారుడు అప్పులపాలయ్యారు. దీంతో తమకున్న 20 సెంట్ల భూమిని విక్రయించడానికి సంతకం పెట్టాలంటూ గత కొద్దిరోజులుగా ఒత్తిడి చేస్తున్నాడు. ఎప్పటిలాగే ఆదివారం సాయంత్రం భూమి అమ్మేందుకు సంతకం చేయాలని తల్లి అమ్మన్నతో గొడవ పడగా.. పక్కనే ఉన్న పెద్దమ్మ కోనారి నర్సమ్మ(86) అడ్డుతగిలారు. కోపంలో లక్ష్మణరావు ఆమెపై చేయి చేసుకోగా నర్సమ్మ అపస్మారక స్థితికి వెళ్లిపోయింది. ఆస్పత్రికి తరలించేలోగానే మృతి చెందింది. అమ్మన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు సంఘటన స్థలానికి కొత్తూరు సీఐ వేణుగోపాలరావు వెళ్లి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఊపిరి ఆడక చిన్నారి మృతి



చిన్నారి మృతదేహం

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు బాలాజీనగర్‌లో సోమవారం ఉదయం కూలర్ గాలికి ఊపిరి ఆడక తొమ్మిది నెలల చిన్నారి మృతి చెందిన విషాద సంఘటన చోటుచేసుకుంది. శ్రీకాకుళం జిల్లా రణస్థలానికి చెందిన గంట్యాడ ఉమా మహేష్ భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీలో పనిచేస్తూ తగరపువలసలో కుటుంబంతో నివసిస్తున్నారు. ఆయనకు భార్య, రెండేళ్ల, తొమ్మిది నెలల వయసు గల కుమార్తెలు ఉన్నారు. రెండు రోజులుగా చిన్న కుమార్తెకు జలుబుగా ఉండడంతో వైద్యం చేయిస్తున్నారు. బాలిక తల్లి సోమవారం ఉదయం స్నానం చేయించి కూలర్ వద్ద పడుకోబెట్టింది. కాసేపటి తర్వాత చూస్తే బాలిక చలనం కోల్పోయింది. దీంతో బాలాజీనగర్‌లో విషాదం నెలకొంది. చుట్టుపక్కల నుంచి పలువురు బాలికను చూసి చలించిపోయారు. వెంటనే చనిపోయిన బాలికను తీసుకుని తల్లిదండ్రులు వారి స్వస్థలానికి వెళ్లిపోయారు. దీనిపై వైద్యులు మాట్లాడుతూ బాలిక శరీరంలో టెంపరేచర్ తగ్గిపోయి చనిపోయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. దీనిపై బాలిక వివరాలు, మిగిలిన విషయాలు తెలియాల్సి ఉంది.

వ్యవసాయ కనెక్షన్ కోసం 1912కి కాల్ చేయండి

సాక్షి, విశాఖపట్నం : కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కావాల్సిన రైతులు టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయవచ్చని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని వివిధ మీ–సేవా కేంద్రాలు, గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోందన్నారు. ఈ కార్యాలయాల్లో కొత్త వ్యవసాయ కనెక్షన్ల నమోదు సమయంలో పత్రాలను అప్‌లోడ్ చేసే సమయంలో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు.

అందుకే రైతులు నేరుగా ఏపీఈపీడీసీఎల్ కాల్ సెంటర్‌కు ఫో న్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

రైలు నుంచి జారి వ్యక్తి మృతి



రామస్వామి(ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం గ్రామానికి చెందిన అంబటి రామస్వామి(38) అనే వ్యక్తి సోమవారం రైలు నుంచి జారి మృతి చెందాడు. రామస్వామి లొద్దపుట్టిలోని అత్తవారింట్లో ఇల్లరికం ఉంటున్నాడు. చెన్నైలో వలస కూలీగా పనిచేస్తున్న ఈయన స్వగ్రామానికి వచ్చే క్రమంలో వ్యక్తిగత పనిపై రాజమండ్రిలో దిగి మళ్లీ మరో రైలులో వస్తుండగా, సోమవారం కంచరపాలెం సమీపంలోకి వచ్చేసరికి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి మృతి చెందాడు. ఈయనకు భార్య మీన, ఇద్దరు కుమార్తెలు రుక్మిణీ, వెన్నెల, కుమారుడు ఢిల్లేశు ఉన్నారు.

మద్యం మత్తులో భార్యపై కత్తితో దాడి



భర్త చేతిలో తీవ్రంగా గాయపడిన భార్య దుర్గ

ఇచ్ఛాపురం: మద్యం మత్తులో భార్యపై భర్త దాడికి తెగబడిన ఘటన పట్టణంలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ముడియా వీధిలో సుదర్శన శ్రీను, భార్య దుర్గ, ఇద్దరు కుమారులతో కొంతకాలంగా నివాసముంటున్నారు. శ్రీను డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. కొంత కాలంగా భార్యపై భర్త అనుమానం పెంచుకోవడంతో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి భర్త జీతం విషయంలో గొడవ జరిగింది. ఈ గొడవలో మద్యం మత్తులో ఉన్న శ్రీను ఇంటిలో కత్తి తీసుకుని భార్యపై దాడిచేశాడు. ఆమెకు చేయి, తలపై తీవ్ర గాయాలయ్యాయి. ఆమె గట్టిగా అరవడంతో చుట్టుపక్కల ఉన్న వారు అక్కడకు చేరుకున్నారు. దీంతో భర్త పారిపోయాడు. స్థానికులు ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం అక్కడి నుంచి బరంపురం పెద్దాస్పత్రికి తీసుకెళ్లారు. భార్య దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఏఎస్ఐ గోపాలకృష్ణ కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుని కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు గెస్టు ఫ్యాకల్టీని నియమిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ఎన్.బాలాజీనాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. కొల్లివలసలో జేఎల్ మ్యాథ్స్ (పురుష అభ్యర్థులు మాత్రమే), కంచిలిలో జేఎల్ కెమిస్ట్రీ (పురుష అభ్యర్థులు మాత్రమే), పాతపట్నం బాలికల పాఠశాలలో టీజీటీ బయోలాజికల్ సైన్సు, పీజీటీ సోషల్ స్టడీస్ (మహిళ అభ్యర్థులు మాత్రమే), ఎచ్చెర్లలో జేఎల్ జువాలజీ (మహిళ అభ్యర్థులు మాత్రమే) పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ, డెమో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల పురుష, మహిళ అభ్యర్థులు వారి బయోడేటాతో పాటుగా పీజీ, బీఈడీ, టెట్ (క్వాలిఫైడ్) ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆదివారంపేటలోని జిల్లా సమన్వయాధికారి కార్యాలయానికి ఈనెల 18 తేదీన ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 08942-279926, 9701736862, 9000314209 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గరిమెళ్లకు ఘనంగా నివాళి



ప్రియాగ్రహారంలో గరిమెళ్లకు నివాళి అర్పిస్తున్న ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు

పోలాకి: శ్రీకాకుళం జిల్లాకు ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, జాతీయోద్యమ నేత, కవి, వాగ్గేయకారుడు గరిమెళ్ల సత్యనారాయణ పేరు పెట్టాలని గరిమెళ్ల ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు కేఎస్‌ఏ భుక్త, బాదాన రాజు డిమాండ్ చేశారు. గరిమెళ్ల 131వ జయంతిని సోమవారం ఆయన స్వగ్రామం ప్రియాగ్రహారంలో నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ జాతి మరచిన జాతిరత్నంగా గరిమెళ్లను అభివర్ణించారు. అనంతరం గరిమెళ్ల ప్రతిభా పురస్కారాల పేరుతో ట్రస్ట్ సమక్షంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు.